విద్యార్థుల ధర్నాకు బిఎస్‌పి మద్దతు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిజాం కళాశాల విద్యార్థినులకు వెంటనే హాస్టల్ సౌకర్యం కల్పించాలని, నూతన బిల్డింగ్‌నూ నిర్మించాలని డా ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ సోమవారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాల్సింది పోయి, వారిపై క్రిమినల్ కేసులు పెడుతామని బెదిరించడాన్ని ఆయన ఖండించారు. 2017లో డిగ్రీ విద్యార్థుల కోసం నిర్మించబడిన హాస్టల్‌ను పిజి విద్యార్థులకు కేటాయించటమేంటని ప్రశ్నించారు. అవసరమైతే మరొక కొత్త భవనాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న విద్యార్థినీలకు సంఘీభావం ప్రకటించారు. వారి పోరాటానికి అండగా ఉంటామని ప్రకటించారు.



ఒయాసిస్ ఫెర్టిలిటీ 11 కేంద్రాలకు విస్తరణ

ప్రజాశక్తి- హైదరాబాద్

ఒయాసిస్ ఫెర్టిలిటీ తన విస్తరణ ప్రణాళికలలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో 11వ కేంద్రాలకు విస్తరించింది. హైదరాబాద్‌లోని టోలిచౌకిలో ఏర్పాటు చేసిన నూతన కేంద్రాన్ని ఆ సంస్థ ఐవిఎఫ్ టెక్నలాజీ ద్వారా పుట్టిన పిల్లల ద్వారా ప్రారంభింపజేశారు. ఒయాసిస్ ఫెర్టిలిటీ, కో-ఫౌండర్, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ దుర్గా జి రావు, ఎండి కిరణ్ గడెల, సిఒఒ సుధాకర్ జాదవ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాబోయే మూడు సంవత్సరాలలో భారతదేశవ్యాప్తంగా 50 కేంద్రాలను స్థాపించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆ సంస్థ తెలిపింది. తమ సంస్థ తల్లితండ్రులు కావాలనుకునే జంటల కలలను నిజం చేసేందుకు వారికి వ్యక్తిగతీకరించిన సంతానసాఫల్య చికిత్సలను అందిస్తోందని పేర్కొంది.

దేశాభివృద్ధికి నెహ్రూ వేసిన పునాదులే కారణం .

- పొన్నాల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశాభివృద్ధికి తొలి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ వేసిన పునాదులే కారణమని పిసిసి మాజీ అధ్యక్షులు పొన్నాల లక్ష్మయ్య అన్నారు. స్వాతంత్ర్యం, బ్రిటీష్ ప్రభుత్వాన్ని ఎదుర్కోవడం ఒక ఎత్తైతే, స్వాతంత్రం వచ్చిన తర్వాత ఈ దేశాన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లడం కాంగ్రెస్ కీలక పాత్ర పోషించిందన్నారు. హైదరాబాద్‌లో నెహ్రు జయంతి సందర్భంగా సోమవారం గాంధీభవన్‌లో ఆయన నెహ్రు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పంచవర్ష ప్రణాళికలు, పరిశ్రమలు, ఇరిగేషన్ ప్రాజెక్టులను నిర్మించడంలో నెహ్రూ కారణమని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో తప్పులు చేస్తున్నాయని చెప్పారు. మాజీ ఎంపి వి హనుమంతరావు మాట్లాడుతూ స్వాతంత్రం కోసం పోరాడిన ఆయన...స్వాతంత్రానంతరం మొదటి ప్రధాని అయిన నేత అన్నారు. అలీన దేశాల నాయకుడిగా విధులు నిర్వహించారని చెప్పారు. ఆజాది కా అమృత్ ఉత్సవ్ నెహ్రూ ఫోటో లేకుండా చేయడం ఏంటని ప్రశ్నించారు.

ఇంటి జాగాలు ఇవ్వండి

- సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట గుడిసెవాసుల ధర్నా
- సర్కారు భూములు ప్రజా అవసరాలకా.. కబ్జాదారులకా..?
- కలెక్టర్, రెవెన్యూ అధికారులు సమాధానం చెప్పాలి
- సిపిఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కె భాస్కర్



కలెక్టరేట్ ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న గుడిసెవాసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'భూమిపై జీవించే మూగ జీవాలు, పక్షులకు సైతం ఉండటానికి తమకంటూ ఓ గూడు ఉంటుంది. ఈ భూమి మీద మనుషులుగా పుట్టిన మాకు మాత్రం తలదాచుకోవడానికి గూడు ఉండకూడదా? మా రెక్కలు ముక్కలు చేసుకుని, చెమట ధారపోసి ప్రభుత్వానికి పన్నులు కడుతూ దేశ సంపదలో భాగమవుతున్నాం. అయినా మమ్మల్ని ఈ సర్కారోళ్లు పట్టించుకున్న పాపానపోలేదు. కానీ వేల కోట్ల విలువ చేసే భూములు పెద్దపెద్దోళ్లకు అప్పనంగా ముట్టజేపుతుండ్రు.. మేం ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుంటే పోలీసులు మాపై దాడులు చేస్తూ గుడిసెలు కూల్చుతున్నారు.. మాకు ఈ భూములపై హక్కు లేదా..? దీనికి ప్రభుత్వమే సమాధానం చెప్పాలి. అప్పటివరకూ మా పోరాటం ఆపేది లేదు. ఎన్ని దినాలైనా ఇక్కడే ఉంటాం' అని కందుకూరు, అబ్దుల్లాపూర్‌మేట్ గుడిసెవాసులు స్పష్టం చేశారు. తమ గుడిసెలను కూల్చడాన్ని నిరసిస్తూ.. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఇంటి జాగా ఇవ్వాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. తమ డిమాండ్లతో కూడిన ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి కె భాస్కర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములు ప్రజా అవసరాల కోసమా.. బడా నాయకులు, రియల్ వ్యాపారుల అక్రమణదారులకు కట్టబెట్టేందుకా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇంటి నిర్మాణం కోసం గుడిసెలు వేసుకున్న పేదలపై దాడులు చేయడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలు గుడిసెలు వేసుకున్న ప్రభుత్వ భూమిని వారు కబ్జా వేయడం అయితే, వేల ఎకరాల ప్రభుత్వ భూములను బడాబాబులు కబ్జా చేస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారని నిలదీశారు. వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వ భూములను బడా వ్యాపారులకు కట్టబెట్టి, కాసులు దండుకునేందుకు ప్రజాప్రతినిధులు, రెవెన్యూ యంత్రాంగం పనిచేస్తుందన్నారు. జిల్లాలో ఎంత భూమి అక్రమణకు గురైందో లిస్టుతో సహా ఇస్తామని, ఆ భూములను కాపాడే దమ్ము జిల్లా యంత్రాంగానికి ఉందా అని ప్రశ్నించారు. వీరిని వదిలి కందుకూరు, అబ్దుల్లాపూర్‌మేట్ ప్రాంతాల్లో ప్రజలు గుడిసెలు వేసుకుంటే ప్రభుత్వం పోలీసు బలగాలతో వారిపై దాడి చేసి గుడిసెలను కూల్చడం సిగ్గు చేటన్నారు. ప్రభుత్వం నిరుపేద దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని చెప్పి, ఇవ్వకపోగా సామాన్యులపై దాడులు చేయడం బాధాకరన్నారు. తక్షణమే పేదలకు ఇంటి జాగాల పంపిణీపై నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన, పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ తిరుపతిరావుకు బాధితులతో కలిసి వినతిపత్రం అందజేశారు. దీనికి సానుకులంగా స్పందించిన అదనపు కలెక్టర్ తమ సమస్యలు త్వరలో పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్టు భాస్కర్ తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పగడాల యాదయ్య, జిల్లా కమిటీ సభ్యులు దుబ్బాక రాంచందర్, జగన్, నర్సింహ, శ్రీనివాస్, జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.



అస్వస్థతకు గురైన విద్యార్థులు

మధ్యాహ్న భోజనం వికటించి..

15 మంది విద్యార్థులకు అస్వస్థత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బాలల దినోత్సవం రోజున మధ్యాహ్నం భోజనం వికటించి విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం పోకలగూడెం ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగింది. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలలో వేడుకలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసారు. పాఠశాలలో మొత్తం 147 మంది విద్యార్థులుండగా.. 111 మంది మాత్రమే భోజనం చేశారు. వారిలో సుమారు 15 మంది విద్యార్థులు దగ్గు, వాంతులతో అస్వస్థతకు గురయ్యారు. గమనించిన ఉపాధ్యాయులు హెచ్ఎం ఝూంకిలాల్‌కు తెలపడంతో స్థానిక ఎఎన్ఎంతో ప్రథమ చికిత్స అందించారు. కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి విద్యార్థులను తరలించారు. అయితే పాఠశాల నుంచి ఇళ్లకు చేరుకున్న మరికొంత మంది విద్యార్థుల్లో నలుగురికి ఇదే పరిస్థితి ఉండటంతో తల్లిదండ్రులు వారినీ ఆస్పత్రికి తరలించారు. వైద్యాధికారి వెంకట ప్రకాష్ చికిత్స అందించారు. విషతుల్యమైన ఆహారం కారణమని పరీక్షించనిదే చెప్పలేమని డాక్టర్లు చెప్పారు.

ఎమ్మెల్యేల కొనుగోలు నిందితుల పిటిషన్ విచారణ వాయిదా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో ఎమ్మెల్యేల కొనుగోలు కేసు నిందితులు రామచంద్రభారతి తదితరులు దాఖలు చేసిన పిటిషన్ విచారణను సుప్రీంకోర్టు 21వ తేదీకి వాయిదా వేసింది. ఈ పిటిషన్‌ను జస్టిస్ బిఆర్ గవాయి, జస్టిస్ విక్రమ్‌నాథ్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం విచారించింది. ఈ అంశంపై తెలంగాణలో అవినీతి నిరోధక శాఖ కోర్టు విచారణ జరుపుతోందనీ, సాయంత్రం ఆదేశాలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. విచారణ వాయిదా వేయాలని కోరారు. అంగీకరించిన ధర్మాసనం సోమవారానికి విచారణ వాయిదా వేసింది.



రోడ్డుపై నిరసన తెలుపుతున్న బాధిత రైతులు

నకిలీ విత్తనాలు విక్రయాలపై నిరసన

- రహదారిపై బైటాయించిన సర్పంచ్, రైతులు
- విక్రయదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నకిలీ విత్తనాలు విక్రయించిన వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ ప్రవీణ్ కుమార్, రైతులు డిమాండ్ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండల కేంద్రంలోని మద్దిమడుగు రహదారిపై సోమవారం రైతులు, ఆయా పార్టీల నాయకులు బైటాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. పత్తి నకిలీ విత్తనాలు వేసి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులు బాగుంటేనే మనందరం బాగుంటామన్నారు. అలాంటి రైతులకు నష్టం జరిగి రోడ్డుపైకి రావడం బాధాకరమన్నారు. ఇక్కడ ఉన్న సబ్‌డీలర్ల వల్ల ఈ తప్పిదం జరగలేదని, పెద్ద పెద్ద బడా బాబుల వల్లే జరిగిందని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తప్పిదం వల్ల నకిలీ విత్తనాలు సరఫరా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, రాజకీయ నాయకుల కమీషన్ల కక్కుర్తి వల్ల రైతులు నేడు రోడ్డుపైకి వచ్చారని ఆవేదన వెలిబుచ్చారు. రైతుల కష్టం సొమ్ముతో వ్యాపారులు ఉన్నత స్థాయికి ఎదుగుతున్నారే తప్ప రైతులు మాత్రం అలాగే ఉన్నారని గుర్తుచేశారు. ఇప్పటికైనా నష్టపోయిన రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. అనంతరం వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు చిన్న చంద్రయ్య, సింగిల్ విండో డైరెక్టర్ రమేష్ యాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రామలింగయ్య యాదవ్, బిజెపి నాయకులు రామోజీ, టిఆర్ఎస్ నాయకులు ముత్యాలు, నగేష్, సత్యనారి, అంజి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థిని ఆత్మహత్య

- ఫోన్ మాట్లాడుతూ.. హాస్టల్ భవనంపై నుంచి దూకిన వైనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



పాలిటెక్నిక్ విద్యార్థిని ఓ ప్రయివేటు హాస్టల్ భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన నిజామాబాద్ నగర శివారులోని ముబారక్‌నగర్ ప్రాంతంలో ఓ ప్రయివేటు హాస్టల్ వద్ద ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామాయంపేటకు చెందిన అక్షిత (17) విజయ్ ఇంజనీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. ఆదివారం రాత్రి భోజనం చేసే సమయంలో తన తల్లితో ఫోన్ మాట్లాడేందుకు పై అంతస్తులోకి వెళ్లింది. ఎంతకీ తన తల్లి ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో ఫోన్ కిందకు విసిరేసి ఆ భవనంపై నుంచి దూకింది. తీవ్ర గాయాలవడంతో నగరంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం ఉదయం మృతి చెందింది. తమ కూతురు చనిపోయినట్టు తెలుసుకున్న విద్యార్థి తల్లిదండ్రులు హుటాహుటిన నిజామాబాద్‌కు చేరుకొని కూతురి మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు. నిజామాబాద్ నార్త్ రూరల్ సిఐ నరహరి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. కుటుంబ కలహాలతో తీవ్ర మనస్తాపానికి గురైన విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలుస్తోంది. కాగా, విద్యార్థిని ఆత్మహత్య ఘటనపై పోలీసులు నిజనిజాలను విచారణ చేసి ఆమె తల్లిదండ్రులకు న్యాయం చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు నిరసన తెలిపారు.

రాజీవ్ స్వగృహ భూమి వేలం

- రూ.1.06 కోట్లకు దక్కించుకున్న జాయ్ వెంచర్స్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వికారాబాద్ పట్టణంలోని ఆర్‌డిఒ కార్యాలయంలో కలెక్టర్ నిఖిల ఆధ్వర్యంలో సోమవారం రాజీవ్ స్వగృహ భూమిని వేలం వేశారు. కాగా ఈ భూమిని రూ.కోటీ ఆరు లక్షలకు జాయ్ వెంచర్స్ దక్కించుకుంది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వికారాబాద్ మున్సిపాల్టీ గంగారంలోని రాజీవ్ స్వగృహ ఓపెన్ స్థలం 3.5 ఎకరాలకు పారదర్శకంగా బహిరంగ వేలంలో విక్రయించినట్టు తెలిపారు. బహిరంగ వేలంలో మొత్తం 40 మంది ప్రత్యక్షంగా పాల్గొన్నారని చెప్పారు. హైదరాబాద్‌కు చెందిన జాయ్ వెంచర్స్ స్థలాన్ని చేజిక్కించుకుందని తెలిపారు. అనంతరం స్థలాన్ని చేజిక్కించుకున్న జాయ్ వెంచర్స్ ప్రతినిధులకు జిల్లా కలెక్టర్ నిఖిల, జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ ధ్రువీకరణపత్రం అందజేశారు. వేలంపాటలో ఆర్‌డిఒ విజయకుమారి, రాజీవ్ స్వగృహ జనరల్ మేనేజర్ నరేందర్‌రెడ్డి, టిఎస్ఐఐసి జోనల్ మేనేజర్ శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.



రాజీవ్ స్వగృహ భూమి వేలంలో మాట్లాడుతున్న కలెక్టర్

మునుగోడులో పోటాపోటీ నినాదాలు

- టిఆర్ఎస్, బిజెపి నాయకుల తోపులాట
- మాజీ ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నల్లగొండ జిల్లా మునుగోడు మండల కేంద్రంలో సోమవారం టిఆర్ఎస్, బిజెపి నాయకుల మధ్య పోటాపోటీ నినాదాలతో కొంత ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు రంగప్రవేశం చేసి ఇరుపార్టీల కార్యకర్తలను చెదరగొట్టారు. బిజెపి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి గొల్ల కురుమల పోరుబాట కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి మొదటిసారి మునుగోడు నియోజకవర్గానికి రావడంతో టిఆర్ఎస్ ఆధ్వర్యంలో చౌటుప్పల్ నుంచి చండూరు వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. బైక్ ర్యాలీ స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్దకు రాగానే టిఆర్ఎస్, బిజెపి కార్యకర్తలు ఎదురుపడ్డారు. ఈ క్రమంలో పోటాపోటీ నినాదాల మధ్య ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. బైక్ ర్యాలీ చండూరుకు వెళ్తున్న తరుణంలో బిజెపి, టిఆర్ఎస్ నాయకులు నినాదాలు చేయడంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. అప్రమత్తమైన పోలీసులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా రెండు పార్టీల వారిని చెదరగొట్టారు.



టిఆర్ఎస్, బిజెపి నాయకుల మధ్య తోపులాట

అకౌంట్లను సీజ్ చేసే అర్హత కెసిఆర్‌కు ఎక్కడిది.. ?

మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

మునుగోడు ఉపఎన్నికల సమయంలో 7,540 మంది గొల్ల కురుమల లబ్దిదారుల అకౌంట్లో డబ్బులు జమచేసి.. ఆ వెంటనే వారి అకౌంట్లను ఎలా సీజ్ చేస్తారని మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రశ్నించారు. గొల్ల కురుమల పోరుబాట సందర్భంగా మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి రాస్తారోకో నిర్వహించారు. దీంతో అక్కడ వాహనాలు నిలిచిపోవడంతో పోలీసులు రాజగోపాల్‌రెడ్డిని అరెస్టు చేసే క్రమంలో పోలీసులకు బిజెపి కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. బిజెపి కార్యకర్తలు కెసిఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం రాజగోపాల్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. మునుగోడు నియోజకవర్గంలో గొల్ల కురుమలను మోసం చేసేందుకు ఓట్ల ముందు నగదు బదిలీ పథకంతో కొత్త జిఒను తీసుకొచ్చి ఖాతాల్లో డబ్బులు జమ చేశారని.. తీరా అవి తీసుకోకుండా అకౌంట్లను లాక్ చేశారని విమర్శించారు. ఇప్పుడు మునుగోడు ఉపఎన్నిక గెలిచాక గొల్ల కురుమలకు పాత పద్ధతిలోనే గొర్రెలు అందిస్తామనడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో పిఎస్‌సిఎప్ చైర్మెన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, చౌటుప్పల్ జెడ్‌పిటిసి చిలుకూరి ప్రభాకర్, చౌటుప్పల్ ఎంపిపి తాడూరి వెంకటరెడ్డి, దోనూరు వీరారెడ్డి పాల్గొన్నారు..

నేటి బాలలే రేపటి పౌరులు

- ఐద్వా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నేటి బాలలే రేపటి పౌరులని వీరనారి ఐలమ్మ ట్రస్టు కార్యదర్శి బి హైమావతి తెలిపారు. జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లోని వీరనారి ఐలమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో బాలలకు డ్రాయింగ్, మ్యూజికల్ చైర్ తదితర ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి ప్రారంభించారు. పోటీలో గెలుపొందిన పిల్లలకు బహుమతులు అందజేశారు. మ్యూజికల్ చైర్స్‌లో మొదటి బహుమతి రిజ్వానా, రెండో బహుమతి మేఘన, మూడో బహుమతి కార్తీక్ పొందారు. చిత్ర లేఖనంలో మొదటి బహుమతి రక్షిత, రెండో బహుమతి సంజన అందుకున్నారు. అనంతరం ఐద్వా అధ్యక్షులు ఆర్ అరుణజ్యోతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో హైమావతి మాట్లాడుతూ కుల, మత, జాతి,లింగ తేడాలు లేని సమాజం వైపు అడుగేయాలన్నారు. మల్లు లక్ష్మి మాట్లాడుతూ ఆటల ద్వారా పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీయొచ్చన్నారు. పాఠశాలల్లో క్రీడా సౌకర్యాలు లేవని చెప్పారు. పిల్లలకు మానసికోల్లాసం ఎంతో అవసరమని చెప్పారు.

ఉద్యోగ ఖాళీలపై శ్వేతపత్రం విడుదల

మధుయాష్కీగౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖల్లోని ఖాళీలపై వెంటనే ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని పిసిసి ప్రచారం కమిటీ చైర్మెన్ మధుయాష్కీగౌడ్ డిమాండ్ చేశారు. అన్ని ఖాళీలను భర్తీ చేసేందుకు తక్షణమే నోటిఫికేషన్లను విడుదల చేయాలని కోరారు. ఈమేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

రాష్ట్రం కోసం కొట్లాడిన దళిత, గిరిజన, బిసి, మైనార్టీ వర్గాల నోట్లో మట్టి కొట్టి, తన కుటుంబానికి మాత్రం కొలువులు ఇచ్చుకున్నారని విమర్శించారు. లక్ష ఉద్యోగాలకు వెంటనే నోటిఫికేషన్లు ఇస్తామని అసెంబ్లీ సాక్షిగా చెప్పిన కేసీఆర్ ఇప్పటివరకూ నోటిఫికేషన్లు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఇంటికో ఉద్యోగమని చెప్పిన కేసీఆర్...కనీసం ఊరికొక్క ఉద్యోగాన్ని కూడా ఇవ్వలేదన్నారు. గ్రూప్ 1, 2 నోటిఫికేషన్లు ఇవ్వకుండా నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్నారని చెప్పారు.

గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో అహ్మదాబాద్ పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకుడుగా పిసిసి మాజీ కార్యనిర్వహక అధ్యక్షులు జెట్టి కుసుమ కుమార్‌ను ఎఐసిసి నియమించింది.

కారుణ్య నియామకాలు చేపట్టండి

మంత్రి హరీశ్‌రావుకు మోడల్ స్కూల్ టీచర్ల వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో మోడల్ స్కూళ్లలోని ఉపాధ్యాయులకు కారుణ్య నియామకాలు చేపట్టాలని తెలంగాణ మోడల్ స్కూల్ టీచర్ల సంఘం (టిఎంఎస్‌టిఎ) కోరింది. ఈ మేరకు ఆర్థిక శాఖ మంత్రి టి హరీశ్‌రావును సోమవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూతం యాకమల్లు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇటీవల వివిధ కారణాలతో 27 మంది ఉపాధ్యాయులు మరణించారని తెలిపారు. కారుణ్య నియామకాలు లేకపోవడంతో వారి కుటుంబాల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు.

రాయితీ సొమ్ము దరిచేరేదెప్పుడో..?

- మూడేళ్లుగా పెండింగ్‌లో పెట్టిన ప్రభుత్వం
- యూనిట్లు పొందిన ఎస్‌సి, ఎస్‌టి అవస్థలు
- బ్యాంకు కిస్తీలు చెల్లించలేక లబ్ధిదారులు సతమతం
- పరిశ్రమలశాఖకు కరువవుతున్న ప్రోత్సాహం



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యువతకు స్వయం ఉపాధి కోసం పరిశ్రమల శాఖ మంజూరు చేసిన యూనిట్లకు రాయితీ సొమ్ము లబ్ధిదారుల దరిచేరడం లేదు. యూనిట్లు స్థాపించి మూడేండ్లు గడుస్తున్నా లబ్ధిదారుల ఖాతాల్లో ఈ సొమ్ము జమ కాకపోవడంతో బ్యాంకు కిస్తీలు సక్రమంగా చెల్లించలేకపోతున్నారు. కొందరైతే బ్యాంకుల కిస్తీలు చెల్లించే బాధల నుంచి ఉపశమనం పొందేందుకు వారికి మంజూరైన వాహనాలను ఇతరులకు విక్రయిస్తున్నారు. వీరి పేరున సంబంధిత వ్యక్తులు బ్యాంకులకు కిస్తీలు చెల్లించేలా ఒప్పందాలు చేసుకున్నారు. ఫలితంగా ఎస్‌సి, ఎస్‌టి లబ్ధిదారుల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందించాల్సిన సబ్సిడీ యూనిట్లు నిర్వీర్యమవుతున్నాయి. 2019 నుంచి రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీని లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయకపోవడంతో పరిశ్రమలశాఖ కార్యాలయం చుట్టూ లబ్ధిదారులు ప్రదక్షిణలు చేస్తున్నారు. ఫలితంగా యువతకు ప్రోత్సాహం అందించాలనే ప్రభుత్వ అసలు ఉద్దేశం పక్కదారిపట్టేందుకు కారణమవుతోంది.

రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి యువతకు స్వయం ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో పరిశ్రమలశాఖ ద్వారా స్వయం ఉపాధి యూనిట్లు మంజూరు చేయాలని భావించింది. ఇందుకు ప్రత్యేకంగా తెలంగాణ స్టేట్ ప్రోగ్రాం ఫర్ ర్యాపిడ్ ఇండస్ట్రీస్ దళిత్ ఎంట్రప్రెన్యూర్ ఇన్సెంటివ్ స్కీమ్ (టీప్రైడ్) పథకం కింద 2017లో వివిధ రకాల యూనిట్లను ఆదిలాబాద్ జిల్లాలో 76 మంది లబ్ధిదారులకు అందజేసింది. ఈ పథకంలో పురుషులకు 35 శాతం, మహిళలకు 40 శాతం సబ్సిడీ కింద జెసిబిలు, కార్లు, ట్రాక్టర్లు, హార్వెస్టర్ తదితర వాహనాలను అందజేసింది. వివిధ బ్యాంకుల ఆర్థికసాయంతో ఈ యూనిట్లను పొందిన లబ్ధిదారులకు ఏడాదిలోగా ప్రభుత్వం రావాల్సిన సబ్సిడీని అందజేయాల్సి ఉంటుంది. కానీ 2019 నుంచి ఇప్పటి వరకు సబ్సిడీ జాడలేకుండా పోవడంతో ఈ యూనిట్లు పొందిన లబ్ధిదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో లబ్ధిదారుడు ఆయా యూనిట్ల ధరలను బట్టి రూ.పది లక్షల నుంచి రూ.20లక్షల వరకు బ్యాంకు రుణం తీసుకొని కొనుగోలు చేశారు. వీటి ద్వారా వచ్చిన ఆదాయంతో బ్యాంకు కిస్తీలు చెల్లిస్తున్నారు. కానీ ప్రభుత్వం నుంచి సబ్సిడీ రావడంలో జాప్యం జరుగుతుండటంతో అనేక మంది లబ్ధిదారులు పరిశ్రమల శాఖ చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. ప్రభుత్వం నుంచి మంజూరుకాకపోవడంతో అధికారులు సైతం తామేమీ చేయలేమని చేతులెత్తేస్తున్నట్టు తెలుస్తోంది.

ఇతరులకు విక్రయం..?

ప్రభుత్వం ద్వారా ఎస్‌సి, ఎస్‌టిలకు మంజూరైన యూనిట్లను నిర్వహించడం కష్టతరంగా మారడంతో ఇతరులకు విక్రయించి బ్యాంకుల బాధ నుంచి ఉపశమనం పొందాలని అనేక మంది లబ్ధిదారులు భావిస్తున్నారు. ఇందులో భాగంగానే సబ్సిడీ రావడంలో ఆలస్యం జరగడం.. తీసుకున్న యూనిట్లు సక్రమంగా నడవకపోవడం.. బ్యాంకు కిస్తీలు చెల్లించే ఆర్థిక స్థోమత లేక పలువురు లబ్ధిదారులు ఇతరులకు విక్రయిస్తున్నట్టు తెలుస్తోంది. ఆయా వాహనాలు అసలు లబ్ధిదారుడి పేరుమీదనే ఉండటంతో వీరి పేరునే ఇతరులు బ్యాంకు కిస్తీలు చెల్లించేలా ఒప్పందాలు చేసుకుంటూ అప్పగిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. బ్యాంకుల నుంచీ లబ్ధిదారులకు కిస్తీలు చెల్లించాలని ఒత్తిడి జరగడంతో వాటిని భరించలేక అమ్మేయడమే శరణ్యమని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

సబ్ ప్లాన్ నిధులు ఉన్నా నిర్లక్ష్యమే..!

ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టిల సంక్షేమం కోసం ఏదేని పథకం ప్రవేశపెడితే వాటికి ఆయా కేటగిరీల సబ్‌ప్లాన్ నిధులనే వినియోగిస్తుంటుంది. ప్రతి బడ్జెట్‌లో ఎస్సీ,ఎస్టీల అభివృద్ధి కోసం సబ్‌ప్లాన్ నిధులను కేటాయిస్తుంది. కానీ వాటిని ఖర్చు చేయడంలో మాత్రం మీనమేషాలు లెక్కిస్తున్నట్టు విమర్శలు వస్తున్నాయి. తాజా పథకం కింద ఎస్‌సి, ఎస్‌టిలకు మంజూరైన యూనిట్లకు సంబంధించి రాయితీ సొమ్మును సబ్‌ప్లాన్ నిధుల నుంచి విడుదల చేసేందుకు ఆస్కారం ఉన్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. వారి కోసం కేటాయించిన సబ్‌ప్లాన్ నిధులను ఇతర పథకాలకు మళ్లించడంతోనే ఈ సమస్య ఉత్పన్నమవుతున్నట్టు ప్రచారం జరుగుతోంది.

సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం : పద్మభూషణ్‌రాజు, పరిశ్రమలశాఖ జిల్లా మేనేజర్

యువత స్వయం ఉపాధికోసం మంజూరైన యూనిట్లకు సంబంధించి ప్రభుత్వం నుంచి సబ్సిడీ రావడంలో ఆలస్యం జరిగిన మాట వాస్తవమే. పలువురు లబ్ధిదారులు మా కార్యాలయానికి వచ్చి అడుగుతున్నారు. లబ్ధిదారులకు అందజేయాల్సిన సబ్సిడీ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. అక్కడ్నుంచి మంజూరుకాగానే లబ్ధిదారులకు అందజేసేలా చర్యలు తీసుకుంటాం.



మా అమ్మానాన్నలను కలపండి

- వారిని ఒకే జిల్లాకు బదిలీ చేయండి
- బాలల దినోత్సవం సందర్భంగా పిల్లల వేడుకోలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'మా అమ్మానాన్నలను కలపండి. వారిని ఒకే జిల్లాకు బదిలీ చేయండి. ముఖ్యమంత్రి మాటే ముద్దు. దంపతులు విడిగా వద్దు'అంటూ చిన్నారులు రాష్ట్ర ప్రభుత్వాన్ని వేడుకున్నారు. బాలల దినోత్సవం సందర్భంగా సోమవారం 13 జిల్లాల స్పౌజ్ ఉపాధ్యాయులు వారి పిల్లలతో సహా మంత్రి టి హరీశ్‌రావును కలిసి విజ్ఞప్తి చేశారు. అనంతరం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ స్పౌజ్ ఫోరం అధ్యక్షులు వివేక్ మాట్లాడుతూ.. 13 జిల్లాల్లో స్పౌజ్ బదిలీలు నిలిచిపోవడంతో పది నెలలుగా తమ కుటుంబాలు తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతున్నాయని చెప్పారు. రాష్ట్రపతి ఉత్తర్వులు-2018 ప్రకారం ఉపాధ్యాయుల విభజన ప్రక్రియ గతేడాది జరిగిందని వివరించారు. ఈ కేటాయింపుల్లో భాగంగా భార్యాభర్తలైన ఉపాధ్యాయులను వారు కోరుకున్న జిల్లాకు కేటాయించాలంటూ 1655 మెమోను ప్రభుత్వం జారీ చేసిందని గుర్తు చేశారు. 19 జిల్లాల్లో ఉపాధ్యాయ దంపతుల బదిలీలను చేపట్టిన ప్రభుత్వం మిగిలిన 13 జిల్లాలపై నిషేధం విధించిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంకా 1,800 మంది ఉపాధ్యాయులు భార్య ఒక జిల్లాలో, భర్త మరో జిల్లాలో విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. వారు బదిలీల కోసం పది నెలలుగా కాళ్లరిగేలా ఎదురుచూస్తున్నారని అన్నారు. మంత్రులు, అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులను కలిసినా ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. సిఎం కెసిఆర్ మాత్రమే ఈ సమస్యకు పరిష్కారం చూపుతారని చెప్పారు. సిఎం మాట కోసం ఉపాధ్యాయ దంపతులు ఎదురుచూస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫోరం ప్రధాన కార్యదర్శి ఖాదర్, నాయకులు విజయలక్ష్మి, శిరీష, వరలక్ష్మి, మిన్హాజ్, హబీబున్నీసా, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎనిమిది ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో మరో ఎనిమిది ప్రభుత్వ మెడికల్ కాలేజీలు అందుబాటులోకి రానున్నాయి. ఈ నెల 15న (మంగళవారం) నూతన కాలేజీలను సిఎం కెసిఆర్ ఆన్‌లైన్ పద్ధతిలో ప్రారంభిస్తారని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి టి.హరీశ్‌రావు తెలిపారు. వెంటనే తరగతులు కూడా ప్రారంభమవుతాయని ఆయన ట్వీట్ చేశారు. వీటి ప్రారంభంతో రామగుండం, నాగర్ కర్నూల్, మహబూబాబాద్, సంగారెడ్డి, వనపర్తి, జగిత్యాల, మంచిర్యాల, కొత్తగూడెం జిల్లాల్లో ప్రభుత్వ మెడికల్ కాలేజీలు అందుబాటులోకి వచ్చినట్టవుతుంది. 2014 నుంచి 2022 వరకు చూస్తే రాష్ట్రంలో మెడికల్ అండర్ గ్రాడ్యుయేట్ సీట్లు 124 శాతం పెరిగాయి. జాతీయ స్థాయిలో ఇది కేవలం 72 శాతంగా ఉంది. అంటే జాతీయ సగటు కంటే 1.3 రెట్లు రాష్ట్రంలో ఎక్కువగా ఉన్నది. పీజీ సీట్ల పెంపుదలలోనూ రాష్ట్రంలో 117 శాతముండగా, జాతీయ స్థాయిలో 93 శాతానికే పరిమితమైంది. దేశవ్యాప్తంగా దాదాపు 18 లక్షల మంది వైద్యవిద్య అభ్యసించేందుకు దరఖాస్తు చేసుకుంటుంటే 91,000 సీట్లు (ఐదు శాతం మాత్రమే) ఉండగా, రాష్ట్రంలో 61,000 దరఖాస్తులకుగాను 6,615 సీట్లు (11 శాతం) ఉండటం గమనార్హం. అంటే సీట్ల లభ్యతలో దేశ సగటు కంటే రెట్టింపు ఉన్నాయి. ఇక గ్రామీణ జిల్లాల్లో వైద్యకళాశాలల విషయంలో దేశంలో 27 శాతముండగా, రాష్ట్రంలో 54 శాతముండటం విశేషం. ఇప్పటికీ వైద్యవిద్యను అభ్యసించాలని కోరుకునే వారి సంఖ్య అధికంగా ఉండటం, సీట్లు తక్కువగా ఉండటంతో ప్రతి ఏడాది విదేశాలకు వెళ్లే వారి సంఖ్య 20 వేల నుంచి 25 వేల వరకున్నట్టు అంచనా.

మోడీవన్నీ అబద్ధాలే..

- ప్రజలను తప్పుదోవ పట్టించటం తగదు
- మంత్రి కొప్పుల ఈశ్వర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రధాన మంత్రి స్థాయిలో మోడీ అబద్ధాలు చెప్పి ప్రజలను పక్కదారి పట్టించడం తగదని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. సోమవారం టిఆర్‌ఎస్ ఎల్‌పి కార్యాలయంలో ప్రభుత్వ విప్ ఎం ఎస్ ప్రభాకర్, ఎంపి బి వెంకటేష్ నేత, ఎమ్మెల్సీ ఎల్ రమణతో కలిసి విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి ప్రయివేటీకరణ విషయంలో మోడీ సత్యదూరమైన వ్యాఖ్యలు చేశారన్నారు. సింగరేణి ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు ఎప్పటి నుంచో ఆందోళనలు చేస్తున్నారని గుర్తుచేశారు. ఆ పోరాటాల ఫలితంగానే ప్రయివేటీకరించబోమంటూ మోడీ చెప్పాల్సి వచ్చిందన్నారు. సింగరేణి అత్యంత పురాతన ప్రభుత్వ రంగ సంస్థ అని చెప్పారు. బొగ్గు వెలికి తీయడంతో ఆ సంస్థకు అనేక సామాజిక భాద్యతలు ఉన్నాయన్నారు. తమ వాటా తక్కువ ఉన్నందుకే ఆ సంస్థను ప్రయివేటీకరణ చేయడం లేదన్నట్టుగా మోడీ మాట్లాడారని గుర్తుచేశారు. పార్లమెంట్‌లో బొగ్గు శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి ఇచ్చిన సమాధానానికి మోడీ ప్రకటనకు వ్యత్యాసం ఉందన్నారు. సింగరేణి కార్మికులకు ఆదాయ పన్నును మినహాయించాలని శాసన సభ తీర్మానం చేసి పంపినా కేంద్రం ఎందుకు స్పందించటం లేదో చెప్పాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ చేయడం అంటే రిజర్వేషన్ల హక్కును హరించడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో అణగారిన వర్గాలకు అన్యాయం రుగుతుందన్నారు. ఈ విషయంపై కేంద్ర సామాజిక న్యాయ శాఖ మంత్రికి ఇప్పటికే లేఖ రాశామని తెలిపారు. భవిష్యత్‌లో ఇదే అంశంపై ఉద్యోగుల నుంచి నిరసనలు తప్పవని హెచ్చరించారు. వెంకటేష్ నేత మాట్లాడుతూ రామగుండం కార్యక్రమంలో స్థానిక ఎంపి నైన నన్ను పిలవకుండా ప్రొటోకాల్ ఉల్లంఘించారని తెలిపారు. బండి సంజయ్‌ను కార్యక్రమానికి ఎందుకు పిలిచారో చెప్పాలని ప్రశ్నించారు.

బాలల సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యత

- బాలల దినోత్సవ వేడుకల్లో మంత్రి సత్యవతి రాథోడ్

ప్రజాశక్తి -కల్చరల్

బాలల హక్కులను పరిరక్షిస్తూ, వారికి సంక్షేమ పథకాల్లో భాగస్వామ్యం కల్పిస్తూ దేశానికి తెలంగాణ మార్గదర్శనం చేస్తోందని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. 18 ఏళ్ల దాటిన యువతులు వివాహం చేసుకుంటే కల్యాణ లక్ష్మి, ఆరోగ్య లక్ష్మి వంటి పథకాలు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని మంత్రి చెప్పారు.

హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ప్రధాన వేదికపై సోమవారం రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల దినోత్సవ వేడుకలు బాలల ఆట పాటలు, కేరింతలు మధ్య ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. బాల రక్షక వాహనం 1098, బాలల రక్షణ సంక్షేమం పోర్టల్, పరిణత బాలల పోర్టల్ సంసిద్ధను మంత్రి సత్యవతి రాథోడ్ ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. 372 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆశా, ఆయాలు బాలలు, స్త్రీ సంక్షేమ పథకాలను వివరిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు వల్ల మాతా శిశు మరణాలు గణనీయంగా తగ్గాయని చెప్పారు.



బాలల దినోత్సవంలో మాట్లాడుతున్న సత్యవతి రాథోడ్

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. నెహ్రూ తన కుమార్తె ఇందిరకు రాసిన లేఖలు చదివితే పిల్లలకు మానసిక స్థైర్యం, పట్టుదల, కృషి ఎంత ముఖ్యమో తెలుస్తుందని చెప్పారు. ఆ స్ఫూర్తిని గ్రహించి బాలలు తప్పుడు మార్గంలో వెళ్లకుండా మంచి అలవాట్లు నేర్చుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లల ప్రవర్తనను ప్రభావితం చేస్తారన్నారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కమిషనర్ దివ్య మాట్లాడుతూ.. వీధి బాలలకు రక్షణ, వారిపై దుండగుల లైంగిక వేధింపులు, దాడి యత్నాల సమయంలో 1098కు సమాచారం అందిస్తే బాల రక్షక వాహనం వారిని రక్షిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో బాలల హక్కుల కమిషన్ చైర్మెన్ శ్రీనివాసరావు, సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్ దీపికారెడ్డి పాల్గొన్నారు.

బదిలీలు వెంటనే ప్రారంభించాలి

- షెడ్యూల్ విడుదల చేయకుంటే మళ్లీ పోరుబాట
- రాష్ట్ర ప్రభుత్వానికి యుఎస్‌పిసి హెచ్చరిక



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని అన్ని యాజమాన్యాల ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యుఎస్‌పిసి) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ముందుగా ఉపాధ్యాయ సంఘాలతో సమావేశాన్ని నిర్వహించి విధివిధానాలపై చర్చించాలని కోరింది. యుఎస్‌పిసి రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సమావేశం సోమవారం ఎన్‌యాదగిరి అధ్యక్షతన హైదరాబాద్‌లోని టిఎస్‌యుటిఎఫ్ కార్యాలయంలో నిర్వహించారు. అనంతరం యుఎస్‌పిసి స్టీరింగ్ కమిటీ సభ్యులు కె జంగయ్య, చావ రవి, వై అశోక్ కుమార్, ఎం రవీందర్, ఎం సోమయ్య, టి లింగారెడ్డి, జాడి రాజన్న, జాదవ్ వెంకట్రావు, డి రాజనర్సుబాబు, బి కొండయ్య, ఎస్ హరికృష్ణ, వై విజయకుమార్, ఆర్ మంగ, ఎన్ దామోదర్, సుధాకర్‌రెడ్డి, విజయసాగర్, రామలింగం సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు. వేసవి సెలవుల్లో చేస్తామన్న బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను విద్యాసంవత్సరం ప్రారంభమై ఆరు నెలలు కావస్తున్నా చేపట్టకపోవడం శోచనీయమని విమర్శించారు. యుఎస్‌పిసి ఆధ్వర్యంలో ఉధృతమైన పోరాటాలు నిర్వహించినా ప్రభుత్వంలో చలనం లేదని తెలిపారు. పాఠశాలల్లో వేలాది పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల్లేక విద్యార్థులకు ఎనలేని నష్టం జరుగుతున్నదని పేర్కొన్నారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఏడేండ్లుగా పదోన్నోతుల కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. రాష్ట్రపతి ఉత్తర్వులకు అనుగుణంగా వివాదం లేని క్యాడర్ల వరకు బదిలీలు, పదోన్నతులు చేపట్టటానికి ప్రభుత్వం ఎందుకు వెనకాడుతుందో అర్థం కావడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు.

ఈనెలాఖరులోగా బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను విడుదల చేయకపోతే డిసెంబర్‌లో మరోసారి పోరుబాట పట్టాలని నిర్ణయించామని తెలిపారు.

317 జీవో అమలు కారణంగా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులను దశలవారీగా స్వంత జిల్లాలకు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. భార్యాభర్తల బదిలీలను అనుమతించాలనీ, ఇతర అప్పీళ్లన్నింటినీ సత్వరమే పరిష్కరించాలని కోరారు. పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్థంగా మారిందనీ, తక్షణమే సర్వీస్ పర్సన్లను నియమించాలని తెలిపారు. ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉన్న సందర్భంలో సమాంతర ఆంగ్ల మాధ్యమంతోపాటు ఎఫ్ఎల్ఎన్ అమలు తలకుమించిన భారంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులపై రాతపని భారాన్ని తగ్గించాలనీ, పర్యవేక్షణ ఒత్తిడి తగ్గించి బోధనాభ్యసన ప్రక్రియ సజావుగా సాగేటట్టు చూడాలని విద్యాశాఖ అధికారులను డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి ముందు యుఎస్‌పిసి స్టీరింగ్ కమిటీ సభ్యులు విద్యాశాఖమంత్రి పి సబితా ఇంద్రారెడ్డిని హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం సమర్పించారు.

అనుమానాస్పద స్థితిలో కార్మికుని మృతి

- పరిశ్రమ ఎదుట మృతుని భార్య పిల్లలతో ఆందోళన
- స్పందించని యాజమాన్యం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉద్యోగానికి వెళ్లిన వ్యక్తి అనుమానాస్పద స్థితిలో సొంత గ్రామంలోని కోనేరులో శవమై కనిపించాడు. పరిశ్రమకు చెందినవారే తన భర్తను హత్య చేసి కోనేరులో పడేసి మూడ్రోజులైనా తనకు చెప్పకుండా గోప్యంగా ఉంచారని, దీనిపై విచారణ జరిపి తనకు న్యాయం చేయాలంటూ పరిశ్రమ ఎదుట కార్మికుని భార్య, తన పిల్లలు, అత్తమామలతో కలిసి ఆందోళన చేపట్టింది. ఈ ఘటన సోమవారం మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కాళ్లకల్‌లో జరిగింది. మృతుని భార్య నవ్య తెలిపిన వివరాల ప్రకారం... సిద్దిపేట జిల్లా ములుగు మండలం బండ తిమ్మాపూర్ గ్రామానికి చెందిన మంగలి మల్లేష్(32) మనోహరాబాద్ మండలం కాళ్లకల్ శివారులోని యూకిస్ సీడ్స్ ప్రయివేటు లిమిటెడ్ పరిశ్రమలో ప్లాంట్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. మల్లేష్‌కు భార్య నవ్య, కూతురు మూడేళ్ల మనస్విని, ఐదు నెలల కుమారుడు మోక్షిత్ ఉన్నారు.

ప్రతి రోజు మాదిరిగానే ఈ నెల తొమ్మిదిన ఉదయం కాళ్లకల్ శివారులో ఉన్న సీడ్ పరిశ్రమకు వెళ్లాడు. సాయంత్రం భార్య నవ్య ఫోన్ చేసి ఆలస్యమవుతుందని చెప్పాడు. పదిన ఫోన్ చేయగా స్విచ్‌ఆఫ్ రావడంతో అనుమానం వచ్చి మల్లేష్ కుటుంబ సభ్యులు పరిశ్రమ వద్దకు వెళ్లారు. మల్లేష్‌కు చెందిన ద్విచక్రవాహనం, ఫోన్ పరిశ్రమలోనే ఉన్నాయి. మల్లేష్ పరిశ్రమలో లేకపోవడంతో చుట్టుపక్కల వెతికారు. శుక్రవారం మధ్యాహ్నం బండ తిమ్మాపూర్ గ్రామ శివారులోని కోనేరు వద్ద మల్లేష్ చెప్పులు కనిపించాయి. దాంతో అనుమానంతో వెతకడంతో మల్లేష్ కోనేరులో శవమై కనిపించాడు. మృతుని భార్య, ఇద్దరు పిల్లలు కుటుంబీకులతో కలిసి తమకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం పరిశ్రమ ఎదుట ఆందోళనకు దిగారు. తన భర్తను పరిశ్రమలో చంపి అనుమానం రాకుండా కోనేరులో పడేశారని నవ్య ఆరోపించారు. పరిశ్రమ యజమానికి, మేనేజర్‌కు ఫోన్ చేసినా ఎలాంటి స్పందనా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన భర్త మృతికి కారణమైన పరిశ్రమ యాజమాన్యంతో చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని నవ్య డిమాండ్ చేశారు. పరిశ్రమ యాజమాన్యం మాత్రం సాయంత్రం వరకు రాకపోవడంతో మృతుని బంధువులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

టైగర్ రిజర్వ్‌ల నిర్వహణ అద్భుతం

- జాతీయ పులుల సంరక్షణ అథారిటీ బృందం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జాతీయ పులుల సంరక్షణ అథారిటీ (ఎన్‌టిసిఎ) బృందం రాష్ట్రంలో వారం రోజుల పాటు పర్యటించింది. అమ్రాబాద్, కవ్వాల్ పులుల అభయారణ్యాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించింది. దేశవ్యాప్తంగా ఉన్న టైగర్ రిజర్వుల పనితీరు, నిర్వహణపై ప్రతీ నాలుగేండ్లకు ఒకసారి జాతీయ అథారిటీ మూల్యాంకన బృందంతో మదింపు చేయిస్తున్నది. దీనిలో భాగంగా రాష్ట్రంలో ఉన్న రెండు టైగర్ రిజర్వుల్లో ఈ బృందం పర్యటించి, అటవీ శాఖ తీసుకుంటున్న చర్యలను పరిశీలించింది. సోమవారం అరణ్య భవన్‌లో పీసీసీఎఫ్, హెచ్‌ఓఎఫ్ ఆర్.ఎం. డోబ్రియాల్‌తో జాతీయ పులుల సంరక్షణ అథారిటీ బృందం సభ్యులు ధీరేంద్ర సుమన్, నితిన్ కకోద్కర్‌లు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వ్‌ల నిర్వహణ జాతీయ స్థాయి ప్రమాణాలతో అద్భుతంగా ఉందని ప్రశంసించారు. పులులు, ఇతర వన్యప్రాణుల సంరక్షణ కోసం అటవీ రక్షణ చర్యలు, గడ్డి క్షేత్రాల పెంపు, నీటి వసతి నిర్వహణ బాగుందని తెలిపారు. తెలంగాణ అటవీ శాఖ ప్రయత్నాలు, ఇతర కారిడార్ నుంచి వచ్చే పులులకు రెడ్ కార్పెట్ పరుస్తున్నాయని బృందం సభ్యులు అభిప్రాయపడ్డారు. ఇటీవల పెరిగిన పులుల కదలికలను అందుకు ఉదాహరణగా చెప్పారు. మహారాష్ట్రలో ఉన్న తడోబా, తిప్పేశ్వర్ అభయారణ్యంలలో పులుల జనాభా పెరిగి, ఒత్తిడి ఉందనీ, అవి కవ్వాల్‌కు వచ్చి స్థిర నివాసం ఏర్పాటు చేసుకునేందుకు అనువైన వాతావరణం ప్రస్తుతం ఉందని అన్నారు. అటవీ అవాసాల పునరుద్ధరణలో భాగంగా కోర్ ఏరియాలో ఉన్న గ్రామాల తరలింపు శుభసూచకమనీ, మిగతా గ్రామాల తరలింపు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. అలాగే కారిడార్‌లో ఉన్న మిగతా ప్రాంతాన్ని రక్షిత ప్రాంతంగా గుర్తించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఎన్‌టిసిఎ బృందం

టైగర్ రిజర్వ్ కోర్ ఏరియాల్లో తునికాకు సేకరణను నియంత్రించాలని ఈ బృందం సూచించింది. రెండు రిజర్వుల్లోనూ సిబ్బంది, యువ అధికారులు బాగా పనిచేస్తున్నారని, ఇదే తరహా ఉత్సాహాన్ని కొనసాగించాలని సూచించారు. పులుల సంరక్షణ కోసం ప్రత్యేక టైగర్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఏర్పాటు, మరిన్ని బేస్ క్యాంపుల ఏర్పాటును పరిశీలించాలని చేసిన ప్రతిపాదనకు పీసీసీఎఫ్ వెంటనే స్పందించి రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదిస్తామని తెలిపారు. పులుల అభయారణ్యాల సమర్థ నిర్వహణ కోసం మరింతగా కంపా నిధుల వినియోగానికి మద్దతు ఇవ్వాలని ఈ సందర్భంగా పీసీసీఎఫ్ అభ్యర్థించారు. ఈ విషయాన్ని కేంద్ర పరిశీలనకు తీసుకువెళ్తామని ఆ బృందం హామీ ఇచ్చింది. ఈ సమావేశంలో పిసిసిఎఫ్ (కంపా) లోకేష్ జైస్వాల్, కవ్వాల్, అమ్రాబాద్ ఫీల్డ్ డైరెక్టర్లు వినోద్ కుమార్, క్షితిజ, అటవీ శాఖ ఓఎస్డీ (వైల్డ్ లైఫ్) శంకరన్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ బోర్డు సిఇఒ అబ్దుల్ ఖాలిక్ హఠాన్మరణం

- మంత్రి సబిత దిగ్భ్రాంతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



ఇంటర్ బోర్డు పరీక్షల నియంత్రణాధికారి (సిఇఒ) మహమ్మద్ అబ్దుల్ ఖాలిక్ (57) అనారోగ్యంతో సోమవారం హఠాన్మరణం పొందారు. క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు. అబ్దుల్ ఖాలిక్ ప్రస్తుతం కరీంనగర్ డిఐఈఒగా పనిచేస్తున్నారు. ఆయన హఠాన్మరణం పట్ల ఇంటర్ బోర్డు ఉద్యోగులు, కుటుంబ సభ్యులు బాధలో మునిగిపోయారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుని కన్నీరుమున్నీరయ్యారు. నిజామాబాద్ జిల్లాలో అబ్దుల్ ఖాలిక్ అంత్యక్రియలు ముగిశాయి. ఇంటర్ బోర్డు మాజీ కార్యదర్శి సయ్యద్ ఒమర్ జలీల్, ఇంటర్ విద్యా జేఏసీ చైర్మెన్ పి మధుసూదన్‌రెడ్డితోపాటు ఇతర ఉద్యోగులు, అధ్యాపకులు, కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని ఆయన భౌతికకాయంపై నివాళులర్పించారు. ఇంటర్ బోర్డు పరీక్షల నియంత్రణాధికారి అబ్దుల్ ఖాలిక్ హఠాన్మరణం పట్ల రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బోర్డులో ఆయన ఉత్తమ సేవలు అందించారని కొనియాడారు. ఆయన మరణం పట్ల సంతాపం, కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఖాలిక్ మరణం పట్ల టిగ్లా అధ్యక్షులు ఎం జంగయ్య, ప్రధాన కార్యదర్శి మాచర్ల రామకృష్ణగౌడ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాలేజీల కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం (టీఎస్‌జీసీసీఎల్‌ఏ-475) అధ్యక్షులు జి రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్ సంతాపం తెలిపారు.



పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఆయాచితం శ్రీధర్

బాలల్లో పుస్తక పఠనం పెంచాలి

- రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మెన్ ఆయాచితం శ్రీధర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డిజిటల్ క్లాసులు, గూగుల్ సెర్చ్ పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో పిల్లల్లో పుస్తక పఠనం నర్సరీ దశ నుంచే అలవాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మెన్ ఆయాచితం శ్రీధర్ చెప్పారు. నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్ హైదరాబాద్ చిక్కడపల్లి బ్రాంచీలో సోమవారం బాలల పుస్తక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. తమ చిన్నతనంలో ప్రకాశం పంతులు, సుందరయ్యలాంటి వారు నిరాడంబరంగా జీవించడం చూశామని, తమ ఆస్తి అంతా త్యాగం చేసి ప్రజా సేవ చేశారన్నారు. కానీ నేడు బిల్ గేట్స్ లాంటి వారు ఎలా కోట్లు సంపాదిస్తున్నారో తెలుసుకొని వీరిని గొప్పగా చెప్పే స్థితిలో ఉన్నామని చెప్పారు. పిల్లల్లో దేశభక్తి, స్నేహం, స్వేచ్ఛ, సోదరతత్వం, లౌకిక భావాలు పెంపొందించాలని సూచించారు. పలు పాఠశాలల బాలబాలికలు ఉదయం నుంచే ఈ పుస్తక ప్రదర్శనకు వచ్చి ఆసక్తిగా వివిధ ప్రచురణల పుస్తకాలను తిలకించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ పుస్తక ప్రదర్శనను సద్వినియోగం చేసుకోవాలని, అన్ని రకాలైన పుస్తకాలకు డిస్కౌంట్ పొంది సాహిత్యాభిలాష పెంపొందించుకోవాలని నవతెలంగాణ బుక్‌హౌస్ ఎడిటర్ కె.ఆనందాచారి తెలియజేశారు. మేనేజర్ కిష్టారెడ్డి మాట్లాడుతూ.. బాలల దినోత్సవం, గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన పిల్లల పుస్తక ప్రదర్శనలో పుస్తకాలపై 20% డిస్కౌంట్ ఇస్తామని, దీనిని పాఠకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్ బాబు, కవి తంగిరాల చక్రవర్తి, సిబ్బంది ధనలక్ష్మి, సిద్ధు, సుధాకర్, రఘు, రాజు, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికులకు వేతన ఒప్పందాలను అమలు చేయండి

- సిఎం కెసిఆర్‌కు జూలకంటి లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆర్‌టిసి కార్మికులకు 2017, 2021 వేతన ఒప్పందాలను అమలు చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డిఎ, 2013 సవరించిన పే-స్కేలు బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు సోమవారం ఆయన లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వం వాడుకున్న రూ.1,500 కోట్ల కార్మికుల భవిష్య నిధిని ఆర్‌టిసి పిఎఫ్ ట్రస్టుకు చెల్లించాలని తెలిపారు. కార్మికుల నుంచి రికవరీ చేసిన రూ.800 కోట్లను సిసిఎస్‌కు చెల్లించాలంటూ గతంలో ప్రభుత్వానికి అనేక విజ్ఞప్తులు చేశామని గుర్తు చేశారు. ఈ సమస్యలను పరిష్కరిస్తామంటూ సిఎం కెసిఆర్ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. కానీ ఇప్పటి వరకూ అవి పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉండటం కార్మికులను, కార్మిక నాయకులను ఆందోళనకు గురిచేస్తోందని తెలిపారు.

వాటితోపాటు ఆర్‌టిసి కార్మికోద్యమంపై నిషేధం తొలగించాలని జూలకంటి డిమాండ్ చేశారు. కార్మికులపై యాజమాన్యం వేధింపుల్లేకుండా యూనియన్ నాయకులతో స్నేహపూర్వక వాతావరణంలో ఆర్‌టిసిని ప్రగతి పథంలో నడిపించే అవకాశాలను మెరుగుపర్చాలని సూచించారు. బడ్జెట్‌లో రెండు శాతం నిధులు కేటాయించాలనీ, రాయితీ బకాయిలు చెల్లించాలని కోరారు. ఆర్‌టిసిని ప్రజారవాణగా అభివృద్ధి చేసేందుకు బస్సుల సంఖ్యను పెంచాలంటూ ప్రతిపక్షాలు, సంఘాలు ప్రభుత్వాన్ని కోరున్నాయని గుర్తు చేశారు. ఇటీవల మునుగోడు ఉప ఎన్నికల సందర్భంగా కూడా ఆర్టీసీ కార్మికుల సమస్యలపై సిఎం సానుకూలంగా స్పందించారని తెలిపారు.